# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-03-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఏప్రిల్ మొదటి వారంలో ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు ప్రకటించారు.**

**2.** **రాష్ట్రంలో 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

**3.** **నూజివీడు మామిడికి మరింత ప్రాచుర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గృహ నిర్మాణ శాఖ కొలుసు పార్థసారథి అన్నారు.**

**4.** **అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని రాష్ట్ర గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**

**5.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

డీఎస్సీ నోటిఫికేషన్ ఏప్రిల్ మొదటి వారంలో ఇస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి డీఎస్సీ ప్రకియ పూర్తి చేసి ఉద్యోగాలను భర్తీ చేయనున్నామని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని 2027లోగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

..వాయిస్ .. 31 సెకన్లు

కాగా రేపు కూడా కలెక్టర్ల సదస్సు కొనసాగనుంది .

--------------------------

రాష్ట్రంలో 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో ఉద్యోగాల కల్పనపై మంత్రుల ఉపసంఘం సమావేశమైంది. ఈ మేరకు సామాజిక మాధ్యమం “ఎక్స్” వేదికగా నారా లోకేష్ స్పందిస్తూ, ప్రభుత్వం ఇప్పటివరకు

కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా 8 లక్షల 73 వేల 220 కోట్ల రూపాయల పెట్టుబడులు, తద్వారా 5 లక్షల 27 వేల 824 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

---------------------------

నూజివీడు మామిడికి మరింత ప్రాచుర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో మామిడి పరిశోధనపై ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యశాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మామిడి పంటకు బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తామని అన్నారు. మామిడి పంటను నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టడంతో పాటు, రవాణా సౌకర్యాలను మెరుగు పర్చనున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని వాణిజ్య సముదాయలు, సినిమా థియేటర్లలో వాహనాల పార్కింగ్ రుసుమును క్రమబద్ధీకరిస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకొస్తుందని పేర్కొన్నారు. మొదటి అర గంటకు ఎవరి నుంచీ పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని ఆదేశించారు. అనంతరం గంట వరకు వాహనం ఉంచితే సదరు షాపింగ్ మాల్ లో వస్తువుల కొనుగోలు బిల్లు చూపిన వారి నుంచి ఫీజు వసూలు చేయరాదని సూచించారు. అలాగే గంటకు పైగా ఉన్న వాహనదారులకు సినిమా టికెట్ లేదా పార్కింగ్ ఫీజు కంటే ఎక్కువ బిల్లు చూపినా ఉచిత పార్కింగ్ అవకాశం వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

---------------------------

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 'ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ 2024-29'ను ప్రభుత్వం ప్రకటించిందని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ పాలసీ విధివిధానాలు నిన్న ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, వ్యవస్థాపక రంగాలలో ప్రపంచకేంద్రంగా తయారు చేసేందుకు ఈ విధివిధానాలు దోహదపడతాయని చెప్పారు. అంకుర పరిశ్రమలను ఏర్పాటు చేసేవారు, ఇప్పటికే ఏర్పాటు చేసినవారు కూడా ఆర్థిక, ఆర్థికేతర మద్దతు కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

---------------------------

అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను కేటాయిస్తామని రాష్ట్ర గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని టిడ్కో గృహ సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలో దాదాపు 6 వేల 400 గృహాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా 2 వేల 304 గృహాలు పూర్తి అయ్యాయని చెప్పారు. త్వరలో మిగిలిన వాటిని కూడా పూర్తిచేసి అర్హులైన వారికి అందిస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయాలలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, ఇతర మౌలిక వసతులను కల్పించామని, త్వరలో ఇక్కడ అంగన్వాడి కేంద్రం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాపింగ్ సముదాయాలను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

స్వస్థలానికి దూరంగా వసతిగృహాలు, గురుకులాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో సామాజిక భద్రత పింఛను నగదును నేరుగా జమ చేయాలని నిర్ణయించామని వయోవృద్ధుల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర సలహా మండలి సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించి మాట్లాడారు.నిజమైన లబ్ధిదారులకు పింఛను అందించడమే లక్ష్యంగా తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరికీ పింఛను తొలగించబోమని మంత్రి స్పష్టంచేశారు.

---------------------------

తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని ఈరోజు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 నుండి 11 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని ఆగమోక్తంగా చేపట్టారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు నీటితో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం కార్య నిర్వహణాధికారి జె.శ్యామలారావు పాత్రికేయులతో మాట్లాడుతూ.,

వాయిస్ ..27 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏప్రిల్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి కావలసిన ప్రతిపాదనలను ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు సాధారణ పరిపాలన శాఖకు పంపాల్సిందిగా అన్ని శాఖలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు, సమ్మేటివ్-2 ఏప్రిల్ 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నామని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది.ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ని విడుదల చేసింది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపింది. తొమ్మిదో తరగతి పరీక్షల విధానం పదవ తరగతి పరీక్షలా ఉంటుందని ఈ నేపథ్యంలో వారికి ఉదయం 9 గంటల నుంచి 12 గంటల 15 నిమిషాల వరకు నిర్వహిస్తామని పేర్కొంది.

====================